## క్లుప్తంగా

### కెనడీ మాస్టర్‌కు సత్కారం



సీనియర్ ఉపాధ్యాయుడు కెనడీని సత్కరించిన దళిత సంఘ నాయకులు

సామర్లకోట: ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ ఉండదని, ఎప్పుడూ పిల్లలకు పాఠాలు చెబుతూనే ఉంటారని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మైలాబత్తుల జానీమోజెస్ అన్నారు. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో పని చేసిన కెనడీ మాస్టర్ ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఖాళీగా ఉన్న సమయం పేద విద్యార్థులకు విద్యా బోధన చేస్తూ నిత్య ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందాలన్నారు. అనంతరం కెనడీ మాస్టర్‌ను ఘనంగా సత్కరించారు. మాలమహానాడు నాయకులు లింగం శివప్రసాద్, నేతల హరిబాబు, నీలం నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### నేడు దళితుల ఆత్మీయ సమేళనం

సామర్లకోట: వైఎస్సార్ సీపీ పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి దళిత ఆత్మీయ సమ్మేళం జరుగుతుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ తెలిపారు. సోమవారం సాయంత్ర ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సామర్లకోట–పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని ప్రైవేటు లేఅవుట్‌లో జరిగే దళిత సమ్మేళంలో రాష్ట్రంలోని దళిత నాయకులు, మంత్రులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దళితుల కోసం తీసుకున్న నిర్ణయాలను ఈ కార్యక్రమంలో వివరిస్తారని తెలిపారు. దళితులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

### కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా సోమవారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు సంతోష్ ఘనాపాఠి, గంగాధరబట్ల శర్మ, కంచిభట్ల సాయిరామ్, వ్రతపురోహితులు చెల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి సోకితే ప్లేట్‌లెట్స్ తగ్గి పోతాయన్నారు. ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట మాత్రమే కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### బడిబయటి బాలికలను కేజీబీవీల్లో చేర్పించాలి

తొండంగి: గ్రామాల్లో చదువు మానేసిన బాలికలను కేజీబీవీల్లో చేర్పించాలని సమగ్ర శిక్షా అభియాన్ బాలికల సంరక్షణాధికారి పి.ఉమామహేశ్వరి సూచించారు. మండలంలోని వాకదారిపేట పరిసర గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. బడిబయట పిల్లలను గుర్తించి కేజీబీవీల్లో చేర్పించారు. కేజీబీవీలో బాలికలకు అందించే సౌకర్యాలు, రక్షణ, విద్య, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటి అంశాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. పేదలు, తల్లిదండ్రులు లేని బాలికలకు కేజీబీవీల ద్వారా ఉజ్వల భవిష్యత్తు పొందే అవకాశం ఉందన్నారు. కేజీబీవీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# నువ్వు సాగు.. లాభాలు బాగు

- మెట్ట ప్రాంతంలో జోరుగా నువ్వుల సాగు
- ఆశాజనకంగా దిగుబడులు, ధర
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆశాజనకంగా ఉన్న నువ్వు పంట

పిఠాపురం/గొల్లప్రోలు: నువ్వు పంట రైతులలకు నవ్వులు పూయిస్తోంది. నూనె గింజలైన నువ్వులకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. ధర, దిగుబడి బాగుండటంతో రైతులు ఈ ఏడాది నువ్వుల సాగు అధికంగా చేపట్టారు. రైతులు ఎక్కువగా రబీ సీజన్‌లో నువ్వుల సాగు చేస్తారు. తక్కువ కాలంలో మిత పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే నూనె గింజల సాగులో నువ్వుల పంట ముందుంటుంది. ఇతర పంటలతో పోలిస్తే నువ్వుల సాగు అధిక నికర ఆదాయాన్ని ఇస్తోంది. అధిక ఉష్ణోగ్రతల్లో బాగా పండే పంట కావడంతో వేసవిలో రైతులు అధికంగా సాగు చేస్తారు. ఈ ఏడాది నువ్వుల పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**గొల్లప్రోలు మండలంలో...**

కాకినాడ జిల్లాలో వాణిజ్య పంటలకు నెలవుగా ఉన్న గొల్లప్రోలు మండలంలో సుమారు 500 మంది రైతులు 800 ఎకరాల్లో నువ్వుల సాగు చేపట్టారు. మండలంలోని దుర్గాడ, చెందుర్తి, ఎ.విజయనగరం, తాటిపర్తి, చేబ్రోలు తదితర గ్రామాల్లో రైతులు ఈ ఏడాది నువ్వుల సాగు చేశారు. ఎకరానికి రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకూ పెట్టుబడి అవుతుండగా రూ.50 వేలకు పైగా ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు. వేసవికాలంలో రెండు నీటి తడులు ఇవ్వగల అవకాశం ఉన్న ప్రాంతాల్లో నువ్వుల సాగును మించిన పంట లేదంటున్నారు. నువ్వుల నూనెకు ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉండడంతో ధర ఆశాజనకంగా ఉంటోంది. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకు లభిస్తుండడంతో రైతులు ఆనందంగా సాగు చేస్తున్నారు.



విరగకాసిన నువ్వు చేను



నువ్వులు

**గొల్లప్రోలు మండలంలో నువ్వు సాగు వివరాలు**

| | |
|---|---|
| నువ్వు పంట సాగు చేసిన రైతులు | 500 మంది |
| నువ్వు సాగు విస్తీర్ణం | 800 ఎకరాలు |
| ఎకరానికి దిగుబడి | 6 నుంచి 8 క్వింటాళ్లు |
| బస్తా ధర | రూ.8 వేలకు పైగా |

**పెట్టుబడి ఇలా..**

మిగతా పంటలతో పోలిస్తే నువ్వు సాగులో పెట్టుబడి కాస్త తక్కువగానే ఉంటోంది. పొలం తయారీకి రూ.1800, విత్తనం రూ.300, కలుపుతీత రూ.1000, ఎరువులు రూ.1200, పురుగు మందులు రూ.1700, కోత, నూర్పిడికి రూ.3000 వెరసి ఎకరాకు సుమారు రూ.9 వేల వరకూ పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. పంట ఆశాజనకంగా పండితే ఎకరానికి 7 బస్తాల వరకూ దిగుబడి వచ్చి పెట్టుబడి పోను రూ.50 వేల ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో జనవరి నెల నుంచి నువ్వుల సాగు చేపడతారు. మార్చి నెలాఖరుకు పంట చేతికొస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో బస్తా (80 కేజీలు) నువ్వుల ధర రూ.8 వేలకు పైగా పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**తక్కువ పెట్టుబడితో...**



నా పేరు గుండుబల్లి గణేష్. మాది గొల్లప్రోలు మండలం చేబ్రోలు. నేను రెండెకరాల్లో నువ్వు సాగు చేశాను. ఎకరానికి రూ.10 వేల వరకూ పెట్టుబడి అయ్యింది. పంట ఆశాజనకంగా ఉండడంతో దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో తెగుళ్లు పెద్దగా ఆశించలేదు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారి సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాను. దీంతో తక్కువ పెట్టుబడితో పంట చేతికందుతోంది.

గుండుబల్లి గణేష్, నువ్వు రైతు, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

**పంట బాగుంది**



నా పేరు మేడబోయిన సత్యనారాయణ. మాది గొల్లప్రోలు మండలం దుర్గాడ. నేను రెండున్నర ఎకరాల్లో నువ్వుల పంట సాగు చేశాను. ఎకరానికి రూ.10 వేల వరకూ పెట్టుబడి అయ్యింది. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట చాలా బాగా వచ్చింది. వాతావరణంతో పాటు నీటి వసతి ఉండటంతో కాపు బాగుంది. గతేడాది కంటే దిగుబడి పెరిగే అవకాశం ఉంది. మార్కెట్‌లో మంచి ధరలు కూడా ఉండడంతో ఆదాయం బాగుంటుంది.

మేడబోయిన సత్యనారాయణ, నువ్వు రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

**రైతులకు సూచనలు ఇస్తున్నాం**

రైతు భరోసా కేంద్రం సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో నువ్వు పంట బాగా పండింది. ఎక్కువ దిగుబడులు వస్తున్నాయి. రైతులకు మంచి ఆదాయం వస్తుంది. గత ఏడాది బస్తా రూ.11 వేల వరకూ ధర పలకగా ప్రస్తుతం బస్తా ధర రూ.8 వేలు ఉంది. రేటు పెరిగే అవకాశం ఉంది.

సత్యనారాయణ, వ్యవసాయాధికారి, గొల్లప్రోలు మండలం

### పంచారామ క్షేత్రానికి భక్తుల తాకిడి



తొలి పూజ అందుకున్న కుమారా రామ భీమేశ్వర స్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయానికి భక్తల తాకిడి ఎక్కువైంది. స్వామి వారికి ప్రీతైన రోజు సోమవారం కావడంతో తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో తొలి అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను, ఉపఆలయాలలోని దేవాతామూర్తులను అలంకరించి పూజలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అళ్లకి రాజ్‌గోపాల్, సన్నిధిరాజు వెంకన్న పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

### దొరబాబు పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: చంద్రంపాలెం గ్రామానికి చెందిన తలాటం బుజ్జి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సోమవారం పరామర్శించారు. తలాటం బుజ్జి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దాంతో మృతుని కుటుంబ సభ్యులను దొరబాబు పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే విజయానికి నాంది

- ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు
- పట్టణంలో ఎన్నికల ప్రచారం



పెద్దాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దొరబాబు



దొరబాబుకు హారతి ఇస్తున్న మహిళలు

పెద్దాపురం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ గెలుపునకు నాంది పలుకుందని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. విజయ సంకల్ప యాత్ర పేరిట చేపట్టిన కార్యక్రమంలో ఆయన సోమవారం పట్టణంలో 4, 29వ వార్డు పరిధిలోని చేపలవీధి, దర్గాసెంటర్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, తాడి రాజశేఖర్, ఆ వార్డు కౌన్సిలర్ గోళ్ల విజయలక్ష్మి, పెద్ద, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో దొరబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో సీఎం అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తెరిగి ప్రజలు వైఎస్సార్ సీపీ పట్టం కట్టాలన్నారు. పార్టీ రహితంగా అర్హులందరికీ నవరత్నాలు పథకాల ద్వారా సంక్షేమాన్ని అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుంతుందన్నారు. మీలో ఒక్కడిని.. స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన తనకు జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చారు ప్రతీ ఒక్కరూ నన్ను ఆదరించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని దొరబాబు కోరారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించుకోవాలన్నారు. స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, నియోజకవర్గ ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా తనను, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌కు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు చీకట్ల కిషోర్, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, పట్టణ కన్వీనర్ చింతా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, గడపా శివ, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మి నారాయణ, కంటే వీర్రాఘవరావు, గోపు నారాయణమూర్తి, కాపగంటి కామేశ్వరావు, పెంటా విజయ్‌కుమార్, సుందరెడ్డి రాజు, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల నానాజీ, జట్లా మోహన్ కుంచే వెంకన్న, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి



గోకివాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత తదితరులు

- వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత
- గోకివాడలో ఎన్నికల ప్రచారం

పిఠాపురం: ప్రజల ముందుకే పాలనను తీసుకువచ్చి, సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం మండలం గోకివాడలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అడుగడుగునా ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. ప్రజలందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు సాదరస్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో మమేకమయ్యారు. మాకు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా చెప్పుకునే అవకాశం మా వద్దే ఉందని, వచ్చే ఎన్నికల్లో మీరే మాకు ఎమ్మెల్యే కావాలని స్థానికులు ముక్త కంఠంతో చెప్పారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లిన ఆమె ఇప్పటివరకూ తాను పిఠాపురం మండలానికి చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కీర్తి హరనాథ్‌బాబు, మాజీ సర్పంచ్ మహేశ్వరరావు, ఎంపీటీసీ వేమగిరి నాగరాజు, బుజ్జి, కొమ్ము చినబాబు, స్వామి, గండేపల్లి బాబీ, పెదపాటి రమేష్ పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలో ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

- బయటి వ్యక్తులకు ఓటర్లు సమాచారం ఇవ్వొద్దు
- కోడ్ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ ఉషారాణి



తాటిపర్తిలో ఓటర్ల ఇంటికి వెళ్లి ప్రచారాలపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ

పెద్దాపురం: గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఎన్నికల ప్రచారాలు చేపడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ప్రచారాలు చేస్తున్నారని, రాజకీయ పార్టీలు గ్రామ స్థాయిలో ఎన్నికల ప్రచారాలు చేపడితే ఆర్ఓ వద్ద నుంచి అనుమతులు తప్పకుండా తీసుకోవాలని మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ (ఎంసీసీ) కన్వీనర్, పెద్దాపురం ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. తాటిపర్తి గ్రామంలో సోమవారం ఆటోలో ఇరువురు, ముగ్గురు యువకుల వచ్చి టీడీపీ పార్టీకి అనుకూలంగా ఓటు వేయాలని ప్రచారం చేపడుతున్న సచివాలయ కార్యదర్శికి సమాచారం రావడంతో వెంటనే ఎంసీసీ అధికారులకు తెలియజేశారు. దీంతో ఎంసీసీ కన్వీనర్ ఉషారాణి గ్రామానికి చేరుకునే సరికి వారు మెల్లగా జారుకోవడంతో ఆమె ఇంటింటికి వెళ్లి ఓటర్లను ఎవరు వచ్చారని ఆరా తీశారు. అయితే తమకు టీడీపీ అనుకూలంగా ఉండాలని, మీ ఫోన్ నంబర్‌కు మెస్సెజ్ వస్తుంది ఓటీపీ చెప్పండి అంటూ వీధిలో ఒక్కో ఇంటికి ఒక్కరూ చొప్పున తిరుగుతున్నారన్నారు. అనుమానం వచ్చి పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు స్థానికులు చెప్పారని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం నెపంతో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి సమాచారం అడిగితే ఓటర్లు చెప్పరాదని, ఎటువంటి అనుమానాలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో కోడ్ అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వీప్ లక్ష్యంపై ప్రజలకు వివరించి గ్రామాల్లో నూరు శాతం పోలింగ్‌కు సిబ్బంది మరింత కృషి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఆమె పంచాయతీ కార్యదర్శులు నక్కా సత్యనారాయణమూర్తి, జ్యోతుల పద్మరాజు, సచివాయల సిబ్బంది ఉన్నారు.

### సత్యనారాయణకు సత్కారం



రైల్వే ఉద్యోగిని సత్కరించిన రైల్వే అధికారులు

సామర్లకోట: స్థానిక రైల్వేలో 41 సంవత్సరాల పాటు పని చేసి పదవి విరమణ పొందిన ఎన్.సత్యనారాయణను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక రైల్వే మేనేజరు ఎం.రమేష్ అన్నారు. సీనియర్ సెక్షన్ ఇంజినీరు సత్యనారాయణ పదవి విరమణ సందర్భంగా సోమవారం సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక రైల్వేలో 1983లో చేరిన సత్యనారాయణ సీనియర్ సెక్షన్ ఇంజినీరుగా ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఉద్యోగంలో మంచి సేవలందించి డీఆర్‌ఎం నుంచి 9 అవార్డులు, ఒక పీసీఈఈ అవార్డు, ఒక జీఎం అవార్డు అందుకున్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఆయనను ఆదర్శంగా తీసుకొని పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏడీఈఎన్ బి.శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీరు బి.రామసుబ్బారావు, రైల్వే ఎస్ఎస్ బి.శ్రీధర్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గౌరవ అధ్యక్షుడు కేవీ వెంకటేశ్వరరావు తదితరులు సత్యనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు.


## నాగు కుటుంబానికి న్యాయం చేయాలి



కట్టమూరు సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెద్దాపురం: కట్టమూరు గ్రామంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన వీర నాగేశ్వరరావు (నాగు) కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐటీయూసీ నాయకులు, ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు పీఎస్ నారాయణ, తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం గదుల నూకరాజు అధ్యక్షతన ది పెద్దాపురం తాపీ వర్కర్స్ యూనియన్ నెల వారీ సమావేశం నిర్వహించారు. అనంతరం వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి రాష్ట్ర నాయకులు పీఎస్ నారాయణ, తోకల ప్రసాద్ కట్టమూరు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన అల్లు అప్పారావు ఇంటి పని చేస్తుండగా భవన నిర్మాణ కార్మికుడు నాగు విద్యుదాఘతానికి గురై మృతి చెందాడన్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ఇంటి యజమాని ఆ కుటుంబాన్ని మోసం చేశారన్నారు. తక్షణమే అధికార యంత్రాంగం స్పందించి నాగు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు లేవని, కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటికి అనుమతులు లేకున్నా ఇంటి నిర్మాణం చేపడితే చూసీ చూడనట్టు వ్యవహరించిన పంచాయతీ సిబ్బందిపై తక్షణమే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. తొలుత నాగు చిత్ర పటం వద్ద నివాళులు అర్పించి ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో గడపా శివబాబు, బత్తుల మురళి, నీలంశెట్టి శ్రీనివాస్, మలిరెడ్డి కృష్ణ, యర్ర రామకృష్ణ, సన్నిటి సత్తిబాబు, మద్దిరాల శ్రీను, అల్లాడి అప్పారావు, సిరికి రాంబాబు, చింతంరెడ్డి వీరబాబు, ఎర్ర చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ




లోవకొత్తూరులో మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న పాస్టర్ రాజబాబు, శ్రీనివాసరావు

తుని రూరల్: దాతలు సమకూర్చిన కుట్టు మెషీన్లను సద్వినియోగం చేసుకుని కుటుంబాలకు ఆసరాగా నిలవాలని తాళ్లూరు గ్రామానికి చెందిన తమరాన శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని లోవకొత్తూరులో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు, ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. పాస్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో ఎఫ్‌పీటీసీ సంస్థ అధినేత పాస్టర్ డాక్టర్ ఐజాక్ బెనర్జీ సౌజన్యంలో ఆరు నెలలు పాటు మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మెషీన్లు అందజేశారు. ఎఫ్‌పీటీసీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిబంధనలు మీరి ఇబ్బంది పడొద్దు

- అధికారుల తనిఖీల్లో ఈ వారంలో రూ.9 లక్షల సొత్తు స్వాధీనం
- పెద్దాపురం ఆర్ఓ, ఆర్డీఓ రామారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఇబ్బందుల్లో పడొద్దని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేస్తున్నామన్నారు. సుమారు 9 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంల ద్వారా సుమారు 36 మంది సిబ్బంది నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారని, గత వారం రోజులుగా తనిఖీల్లో సుమారు తొమ్మిది లక్షల రూపాయల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఆర్ఓ జేఎస్ రామారావు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అచ్చంపేట వద్ద సుమారు 8 లక్షల విలువల కలిగిన కారులో అక్రమంగా తరలిస్తున్న 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, కారుని సీజ్ చేశామన్నారు. లక్ష రూపాయల విలువల కలిగిన సుమారు 290 లీటర్ల సారా, 9.72 లీటర్ల డీపీఎల్ బాటిళ్లు, సుమారు రూ.3,450 నగదును తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి పార్టీ తరపున ఎన్నికల ప్రచారానికి హాజరైన ఇద్దరు వలంటీర్లను సస్పెండ్ చేసినట్టు ఆర్డీఓ జేఎస్ రామారావు వెల్లడించారు. ఎన్నికల నియమావళిపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు



సామర్లకోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

సామర్లకోట: స్థానిక ఇండస్ట్రియల్ ఏరియా విమల్ బాట్లింగ్ కంపెనీ ఎదురుగా సోమవారం ఆటో బోల్తా పడడంతో నలుగురు విద్యార్థినులు గాయపడిన సంఘటన ఇది. స్థానిక బ్రౌన్‌పేటలో ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థినులు పెద్దాపురం, మండల పరిధిలోని గ్రామాలలోని వారి స్వగృహలకు వెళ్లడానికి ఆటో ఎక్కారు. ఆటో సీబీఎం సెంటర్ నుంచి విమల్ బాట్లింగ్ కంపెనీ వద్ద ముందు వెళుతున్న మోటారు సైకిల్‌ను తప్పించే క్రమంలో బోల్తా పడింది. దాంతో ఆటోలో ఉన్న నలుగురి విద్యార్థినులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యార్థునులు పెద్దాపురం, ఆర్‌బీ పట్నం, ఆర్‌బీ కొత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు. ప్రమాద సంఘటన విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని తమ కార్యకర్తలకు సూచించారు. దాంతో పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్ హుటాహుటిన ఆస్పత్రికి చేరుకొని విద్యార్థుల వివరాలు సేకరించారు. విషయం తెలిసి ఎస్సై మౌనిక ఆస్పత్రికి చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ఏడీబీ రోడ్డు లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.